క్లుప్తంగా

వైఎస్ జగన్‌ను కలిసిన రొంగలి జగన్నాథం



మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బుధవారం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రొంగలి జగన్నాథం మర్యాదపూర్వకంగా కలిశారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో తనను వైఎస్ జగన్ ఆప్యాయంగా పలకరించి పలు విషయాలు మాట్లాడారని రొంగలి జగన్నాథం తెలిపారు. అధినేత జగన్ ఆదేశాల ప్రకారం వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. - మురళీనగర్

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



రైల్వే న్యూకాలనీలో శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ ఆళ్ల లీలావతి, అధికారులు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42వ వార్డు రైల్వే న్యూకాలనీ మసీదు రోడ్డు బజార్ వద్ద బుధవారం పలు అభివృద్ధి పనులకు కార్పొరేటర్ ఆళ్ల లీలావతి, జీవీఎంసీ అధికారులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ ప్రాంతంలో జీవీఎంసీ నిధులు రూ.20 లక్షలతో బాక్స్ కల్వర్టు, ఫుట్‌పాత్ టైల్స్ నిర్మించనున్నారు. కార్యక్రమంలో జోన్–5 కమిషనర్ బి.రాము, డీఈ రామసుబ్బారావు, ఏఈ రమణమ్మ, కూటమి నాయకులు శ్యామలాదీపిక, ఆకిరెడ్డి జగదీష్, రమణారావు, గురుగోవింద్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తం



దొండపర్తి వాసులకు అవగాహన కల్పిస్తున్న ఫోర్త్‌టౌన్ సీఐ సత్యనారాయణ

సీతమ్మధార: సైబర్ క్రైం మోసాలపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఫోర్త్‌టౌన్ సీఐ సత్యనారాయణ సూచించారు. దొండపర్తిలో బుధవారం నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనధికార చీటీలు వేసి మోసపోవద్దని స్థానికులకు హితవు పలికారు. ఆన్‌లైన్ రుణాల యాప్‌లపై అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. బాలికల మిస్సింగ్ కేసులు నమోదవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదాలు, అల్లర్లు పెరుగుతున్న నేపథ్యంలో పోలీస్ గస్తీ ముమ్మరం చేశామన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఫోర్త్ టౌన్ పోలీసులు పాల్గొన్నారు.

23న బాడీ లిఫ్టింగ్ పోటీలకు ఎంపిక

సీతంపేట: రామాటాకీస్ ఎదురుగా గల వాయుపుత్ర హెల్త్ క్లబ్‌లో ఈ నెల 23వ తేదీ ఉదయం 10 గంటలకు ఆంధ్రా బాడీ లిఫ్టింగ్ జట్టును ఎంపిక చేయనున్నట్టు ఆంధ్రా బాడీ లిఫ్టింగ్ సంఘం ప్రెసిడెంట్ ఎస్.ఎస్.శివశంకర్ ప్రకటనలో తెలిపారు. 55, 60, 65, 70, 75, 80, 85, 90 కిలోల సీనియర్స్ విభాగంలో వేర్వేరుగా ఎంపికలు జరుగుతాయని చెప్పారు. మాస్టర్స్ విభాగంలో 40, 45, 50, 55, 60 ఏళ్లు దాటిన కేటగిరీల్లో, దివ్యాంగులకు 65 కిలోల లోపల, 65 కిలోలపైన రెండు విభాగాల్లో ఎంపికలు ఉంటాయన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఏపీ తరఫున వచ్చే నెల 26, 27 తేదీల్లో పంజాబ్ రాష్ట్రం జలంధర్‌లో జరగనున్న 15వ జాతీయ బాడీ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఆసక్తి గలవారు ఆధార్ కార్డు జెరాక్స్, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో వాయుపుత్ర హెల్త్ క్లబ్‌కు హాజరు కావాలన్నారు. వివరాలకు 88852 03519 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఎరుకుమాంబకు జలాభిషేకం

సీతమ్మధార: దొండపర్తిలో కొలువుదీరిన ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వహస్తాలతో అమ్మవారికి జలాభిషేకం చేశారు. దేవస్థానం ఈవో జి.రమాబాయి ఆధ్వర్యంలో అర్చకుడు శ్రీనివాస్ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారిని నూతన వస్త్రాలతో, పుష్పాలతో అలంకరించి, భక్తులకు దర్శనాలు కల్పించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సత్యనారాయణరాజు, భక్తులు పాల్గొన్నారు.

అడ్డదిడ్డంగా పార్కింగ్



బిర్లా జంక్షన్ సమీపాన సర్వీస్ రోడ్డులో పార్క్ చేసిన వాహనాలు



రాంగ్ పార్కింగ్ చేసిన వాహనాలను తీస్తున్న ట్రాఫిక్ పోలీసులు



హైవేపై మర్రిపాలెం సర్వీస్ రోడ్డులో పార్క్ చేసిన వాహనాలు



48 బస్‌స్టాప్ మాధవధార జంక్షన్‌లో రోడ్డుపై నిలిపిన వాహనాలు

ప్రధాన రహదారులపై వాహనాల నిలిపివేత

సర్వీస్ రోడ్లపై రాకపోకలకు తంటాలు

ఇబ్బందులు పడుతున్న స్థానికులు, పాదచారులు

మర్రిపాలెం: విశాలమైన రహదారులపై అడ్డదిడ్డంగా వాహనాలు పార్క్‌చేయడంతో అటు కాలనీల వాసులు.. ఇటు వాహన చోదకులు, పాదచారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ట్రాఫిక్ నిబంధనలు పట్టించుకోకుండా ఎక్కడపడితే అక్కడ ఇష్టానుసారంగా పలువురు వాహనాలు నిలిపి వదిలేస్తున్నారు. దీంతో స్థానిక ప్రజలు ఏ చిన్నపని కోసం బయటకు వచ్చినా అవస్థలు పడుతున్నారు.

బారులు తీరుతున్న వాహనాలు

జీవీఎంసీ 49, 50, 51, 53 వార్డుల్లో ప్రధాన రహదారులన్నీ రాంగ్ పార్కింగ్‌లతో నిండి ఉంటున్నాయి. జాతీయ రహదారిని ఆనుకుని ఇక్కడ కొన్ని వస్త్ర దుకాణాలు, షాపింగ్ మాల్స్ ఉండడం, మరో పక్క కార్ల షోరూంలు ఉండటంతో సర్వీస్ రోడ్లన్నీ కార్లు, ద్విచక్ర వాహనాలు, ఆటోల పార్కింగ్‌లకే పరిమితమవుతున్నాయి. మురళీనగర్, మాధవధార ప్రధాన రహదారిలో ఉదయం షాపులు తెరచింది మొదలు రాత్రి 11 వరకు పలువురు వాహన చోదకులు సొంత పనుల మీద వచ్చి పార్క్‌చేసి వెళ్లిపోతారు. వారి పనులు పూర్తి చేసుకుని వచ్చి వాహనాలు తీస్తున్నారు.. అలా దారంతా వాహనాలను నిలిపి వదిలేసి స్థానికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. చిరు వ్యాపారాలు చేసుకునే బళ్ల ముందు, చిన్న చిన్న షాపుల ముందు వాహనాలు నిలిపివేయడంతో వారి వ్యాపారాలకు అడ్డంగా ఉంటున్నాయని, కొనుగోలుదారులు వాహనాలు పెట్టేందుకు వీలుగా లేకపోతే తమ వద్దకు రాకుండా వేరే దుకాణాలను వెళ్తున్నారని విక్రయదారులు లబోదిబోమంటున్నారు. ఇలా వాహనాలు పెట్టడం వల్ల ప్రమాదాలు కూడా ఎక్కువగా జరుగుతంటాయని వాపోతున్నారు. రోడ్డు దాటుతున్న వారికి ఇబ్బందికరంగా ఉంటోందని చెబుతున్నారు.

సర్వీస్ రోడ్డులో కష్టాలు

పంజాబ్ హోటల్ జంక్షన్ నుంచి ఇటు డీ మార్ట్ మీదుగా బిర్లా కూడలి వరకు సర్వీస్ రోడ్డు మొత్తం ఎటుచూసినా వాహనాల పార్కింగ్‌లే కనిపిస్తున్నాయి. పోలీసులు వెహికల్ లిఫ్టింగ్ వాహనంతో నిత్యం వాహనాలను తీస్తున్నా.. కొందరు మాత్రం తమకేంటి అన్నట్టు ఉంటున్నారు. కొంత మంది వాహనాలు పెట్టడమే కాకుండా పెడితే ఏంటి అన్నట్టు దుకాణదారులతో గొడవలు పడుతున్నారు. ఇటు బిర్లా జంక్షన్ నుంచి పంజాబ్ హోటల్ కూడలి మీదుగా ఆర్ అండ్ బీ జంక్షన్ వైపు వెళ్లే దారిలో కార్ల షోరూమ్‌లో ఉన్న కార్లను సర్వీస్ రోడ్డులో నిలుపుతున్నారు.

రాంగ్ పార్కింగ్‌ను నిరోధించాలి

53వ వార్డులో పలు వ్యాపారాలు చేసుకునే ప్రైవేట్ వాహనాలు, సొంత వాహనాలు, ఆటోలు ఇలా అన్ని రకాల వాహనాలను పార్క్‌చేయడంతో కాలనీ నుంచి రోడ్డు వైపు వచ్చే స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని చెబుతున్నారు. లోపల నుంచి సర్వీస్ రోడ్డుకు రావాలంటే వాహనాలు అడ్డంగా నిలిపివేయడంతో మలుపు తిప్పడంలో ఇబ్బందులు ఉంటున్నాయని, అటుగా వచ్చే వాహనాలు వస్తున్నాయో లేదో కనిపించకపోవడం వల్ల ఇబ్బంది పడుతున్నామని, రాంగ్ పార్కింగ్ వల్ల ప్రమాదాలు జరిగే అవగాశాలు ఉన్నాయని వాపోతున్నారు. భారీ వాహనాలను రోజుల తరబడి నిలిపి వదిలేయడంతో సర్వీస్ రోడ్డుపై రాకపోకలకు స్థానికులు, ఇతర వాహన చోదకులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలనీల్లో ఎన్నిసార్లు పార్క్‌చేయవద్దని చెబుతున్నా.. పట్టించుకోవడం లేదని పలువురు స్థానికులు అంటున్నారు. ప్రధాన రహదారులు, సర్వీస్ రోడ్లపై వాహనాల రాంగ్ పార్కింగ్‌లకు ట్రాఫిక్ పోలీసులు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

విద్యార్థులు అన్ని విభాగాల్లో రాణించాలి



ఏయూ రిజిస్ట్రార్ ధనుంజయరావును సత్కరిస్తున్న విద్యా సంస్థల చైర్మన్, సెక్రటరీ

తాటిచెట్లపాలెం: నేటి విద్యార్థులు కేవలం ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) వైపే ఎక్కువగా మొగ్గు చూపుతున్నారని, అన్ని విభాగాల్లోనూ రాణించేందుకు అవకాశాలు మెండుగా ఉన్నాయని ఆంధ్రా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎస్.ధనుంజయరావు పేర్కొన్నారు. తాటిచెట్లపాలెంలోని ఎస్కేఎంఎల్ విద్యా సంస్థల వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన వేడుకలను ప్రారంభించి మాట్లాడుతూ తన విద్యాభ్యాసం ప్రభుత్వ పాఠశాలల్లోనే సాగిందని, పట్టుదలతో చదివి నేడు ఉన్నత స్థాయికి చేరుకోగలిగానన్నారు. విద్యార్థులు ఇష్టపడి చదివి అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. విద్యా సంస్థల సెక్రటరీ బి.నాగభూషణం మాట్లాడుతూ 1991లో ప్రారంభించిన తమ సంస్థ నుంచి ఇప్పటి వరకు కొన్ని వేల మంది ఉత్తమ విద్యార్థులను పంపించగలిగామన్నారు. ఈ ప్రయాణంలో భాగస్వాములైన విద్యార్థులు, వారి కుటుంబాలకు, సిబ్బందికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ధనుంజయరావును విద్యా సంస్థల చైర్మన్ బి.నాగేశ్వరరావు సత్కరించారు. అనంతరం జూనియర్, డిగ్రీ కాలేజీల విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో హోరెత్తించారు. ఏయూ సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఎస్.విజయమోహన్, విద్యా సంస్థల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ప్రభాకర్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, ప్రస్తుత, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

శక్తి యాప్‌తో మహిళలకు భద్రత



శక్తి యాప్ డౌన్‌లోడ్ చేసిన మొబైల్ ఫోన్లు చూపిస్తున్న విద్యార్థినులు

సీతంపేట: విశాఖపట్నం మహిళా పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ ప్రిజమ్ కళాశాలలో బుధవారం మహిళల భద్రత, పోక్సో చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి పి.ప్రదీప మాట్లాడుతూ 18 ఏళ్లలోపు అమ్మాయిలు, అబ్బాయిలు మైనర్లని, భావోద్వేగాలను నియంత్రించుకుని మెలగాలని, ప్రేమ వ్యవహారాల్లో చిక్కుకోకూడదని, లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన శిక్షలకు గురికావలసి వస్తుందన్నారు. లైంగిక వేధింపుల చట్టం, దానిలోని ముఖ్యమైన సెక్షన్లు, శిక్షల గురించి వివరించారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు నైతిక విలువలు, కష్టం, శ్రమ, డబ్బు విలువ తెలియజేయాలని సూచించారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యురాలు ఎం.రజని, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ పి.విజయ్‌కుమార్ మాట్లాడుతూ 14 ఏళ్లలోపు పిల్లలు పనుల్లోకి వెళ్లరాదని, అలాంటి వారిని పనిలో పెట్టుకుంటే చట్టరీత్యా నేరమని తెలిపారు. బాల కార్మికులు కనిపిస్తే 1098 హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలన్నారు. ఈ సందర్భంగా మహిళా పోలీసులు మహిళల స్వీయరక్షణ, మహిళల భద్రత కోసం రూపొందించిన శక్తి యాప్ ప్రత్యేకతలు, ఉపయోగాలను వివరించి, విద్యార్థినుల చేత వారి మొబైల్ ఫోన్లలో శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేయించారు.

చురుగ్గా చోరీ కేసు దర్యాప్తు

సీతమ్మధార: అక్కయ్యపాలెంలో జరిగిన బంగారం చోరీ కేసు దర్యాప్తును ఫోర్త్ టౌన్ క్రైం పోలీసులు వేగవంతం చేశారు. అక్కయ్యపాలెం మహారాణి పార్లర్ దరి సరోజా ఆస్పత్రి సమీపంలోని రెయ్యి శ్రీనివాసరావు అనే వ్యక్తి ఇంట్లో చోరీ జరిగిందని పోలీసులకు ఫిర్యాదు చేయడం తెలిసిందే. 17 తులాల బంగారం ఆభరణాలు, రూ.25 వేల నగదు కలిపి మొత్తం మీద రూ.4.50 లక్షల మేరకు చోరీ జరిగినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫోర్త్ టౌన్ క్రైం సీఐ రాజులునాయుడు పర్యవేక్షణలో క్రైం ఎస్ఐ సత్యారావు తదితరులు చురుగ్గా కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఇందులో భాగంగా సీసీఎస్ పోలీసులు కూడా కొందరు అనుమానితులను డాబాగార్డెన్స్‌లోని సీసీఎస్ స్టేషన్‌లో విచారిస్తున్నారు. క్రైం డీసీపీ లతా మాధురి పర్యవేక్షణలో ఏడీసీపీ మోహనరావు, ఏసీపీ తదితరులు ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకుని దర్యాప్తు సాగిస్తున్నారు. చోరీ జరిగిన రోజు డాగ్ స్క్వాడ్ రాకపోవడం గమనార్హం. క్లూస్ టీం రావడంతో సంఘటన స్థలంలో వేలిముద్రలు సేకరించారు. ప్రస్తుతం దర్యాప్తు చురుగ్గా సాగుతోందని క్రైం పోలీసులు 'సాక్షి'కి తెలిపారు. కాగా.. శ్రీనివాసరావు బ్యాంకు ఖాతాల మీద పోలీసులు నిఘా ఉంచారు.

కెమికల్ టెక్నాలజీ పోటీల్లో గైస్ విద్యార్థులకు బహుమతులు



బహుమతులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న గైస్ ప్రిన్సిపాల్ వెంకటరమణ

మురళీనగర్: జవహర్‌లాల్ నెహ్రూ టెక్నికల్ యూనివర్సిటీ కెమికల్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ ఈ నెల 15, 16 తేదీల్లో కెమికల్ టెక్నాలజీకి సంబంధించి నిర్వహించిన ఎస్‌పీ ఈ ఇంధన్–2కే25 పోటీల్లో కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్(గైస్) విద్యార్థులు ఉత్తమ బహుమతులు సాధించారు. కాలేజీ ఆయిల్ టెక్నాలజీ విభాగం నుంచి ఆరుగురు విద్యార్థులు పాల్గొనగా.. వీరిలో షేక్ తోహిద్ మున్వర్, టి.యశ్వంత్‌కుమార్‌లకు మోడల్ మేనియాలో మొదటి బహుమతిగా రూ.5,000 నగదు, ఎస్.మోహన్, ఇ.దీపక్‌లకు పోస్టర్ ప్రజంటేషన్‌లో తృతీయ బహుమతిగా రూ.1000 నగదు బహుమతిని గెలుచుకున్నారు. వీరికి జేటీయూకే ప్రొఫెసర్ కె.వి.రావు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా బుధవారం కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ అభినందించారు.

దేవాలయాలపై దాడులను ఖండించండి



సదస్సులో పాల్గొన్న సంఘ్ ప్రతినిధులు

సీతంపేట: రాష్ట్రంలో విశ్వహిందూ మహాసంఘ్ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సంఘ్ తెలంగాణ, ఆంధ్రా తెలుగు రాష్ట్రాల కన్వీనర్ డాక్టర్ మద్దిశెట్టి స్వామి పిలుపునిచ్చారు. శంకరమఠం రోడ్డులోని ఆయుష్ ట్రెనింగ్ డివిజన్ కార్యాలయంలో బుధవారం విశ్వహిందూ మహాసంఘ్ ఉత్తరాంధ్ర సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల హిందూ దేవాలయాలపై జరుగుతున్న దాడులను మనం ఖండించాలని, పాడుబడిన దేవాలయాలను అభివృద్ధి చేసుకుందామని తెలిపారు. దీని కోసం ప్రతి సభ్యుడు కృషి చేయాలని కోరారు. త్వరలో ఉత్తరాంధ్ర కమిటీని ఏర్పాటు చేసి నియామక పత్రాలు అందజేస్తామని కన్వీనర్ మద్దిశెట్టి స్వామి తెలిపారు. సదస్సులో సంఘ్ గౌరవ సలహాదారు ఎస్.బుచ్చియ్య ఆచారి, ఉపాధ్యక్షుడు యు.వి.రత్నం, వర్కింగ్ ప్రెసిడెంట్ తుమ్మలపల్లి బ్రహ్మాజీరావు, రాష్ట్ర ప్రతినిధి దేవరపల్లి శ్రీనివాసరావు, తెలంగాణ ఉపాధ్యక్షుడు పలగాని శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

17 మంది స్టాఫ్ నర్సులకు ట్యూటర్లుగా పదోన్నతి

మహారాణిపేట: వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయ పరిధిలోని 17 మంది స్టాఫ్ నర్సులకు నర్సింగ్ కాలేజీ, స్కూళ్లలో ట్యూటర్లుగా పదోన్నతి లభించింది. ఆరోగ్య శాఖ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ పి.రాధా రాణి, డిప్యూటీ డైరెక్టర్ అంజయ్య, ఆఫీస్ సూపరింటెండెంట్ రామ్మోహనరావు ఆధ్వర్యంలో బుధవారం వారికి ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించారు. అభ్యర్థులు ఎంపిక చేసుకున్న ప్రాంతాలకు పదోన్నతితో కూడిన బదిలీ ప్రక్రియ పూర్తి చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రాధారాణి మాట్లాడుతూ పదోన్నతులు పొందిన వారంతా నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని సూచించారు. ఏపీ నర్సింగ్ అసోసియేషన్ విశాఖ జిల్లా యూనిట్ కార్యదర్శి జి.వి.ఎస్. వరలక్ష్మి, వైస్ ప్రెసిడెంట్ ఇందిర మాట్లాడుతూ పారదర్శకంగా పదోన్నతులు జరిగాయన్నారు.

పారిశ్రామిక ప్రగతికి పాలిటెక్నిక్ కీలకం



విద్యార్థులకు ఉద్యోగ నియామక పత్రాలు అందిస్తున్న ప్రొఫెసర్ సోమరాజు

మురళీనగర్: పారిశ్రామిక ప్రగతికి పాలిటెక్నిక్ కీలకంగా మారిందని గాయత్రి విద్యా పరిషత్ కార్యదర్శి ప్రొఫెసర్ పి.సోమరాజు అన్నారు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం నిర్వహించిన కాలేజీ వార్షికోత్సవం, జాబ్ ఎచీవర్స్ డే సమావేశంలో ఆయన మాట్లాడారు. పారిశ్రామిక ప్రగతికి పాలిటెక్నిక్ విద్యతో తక్షణ ఉపాధి పొందవచ్చన్నారు. ప్రయోగాత్మక అనుభవం పాలిటెక్నిక్ విద్యార్థులకు చాలా అవసరమన్నారు. గౌరవ అతిథి వీఎంఆర్‌డీఏ చీఫ్ ఇంజినీర్ ఎం.వినయ్‌కుమార్ మాట్లాడుతూ పాలిటెక్నిక్ చదివిన విద్యార్థులకు మంచి ఉద్యోగాలు వస్తున్నాయని, పాలిటెక్నిక్ విద్యకు డిమాండ్ పెరుగుతూనే ఉంటుందన్నారు.

నూరు శాతం ఉద్యోగాలు

సభాధ్యక్షుడు పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు మాట్లాడుతూ ఈ ఏడాది పాలిటెక్నిక్ విద్యార్థులు రికార్డ్ స్థాయిలో నూరు శాతం ఉద్యోగాలు సాధించినట్లు తెలిపారు. రాష్ట్ర చరిత్రలోనే మొదటిసారిగా రూ.9.06 లక్షల అత్యధిక వార్షిక వేతనంతో తమ కాలేజీ ఎలక్ట్రికల్ డిప్లొమా విభాగానికి చెందిన ముగ్గురు విద్యార్థులు టెక్సాస్ ఇన్‌స్ట్రుమెంట్స్ కంపెనీలో ఉద్యోగాలు సాధించారని వెల్లడించారు. ఈ ఏడాది రాష్ట్ర స్థాయి, రీజనల్ స్థాయి క్రీడా పోటీలు, ప్రాంతీయ స్థాయి టెక్ ఫెస్ట్ విజయవంతంగా నిర్వహించామన్నారు. ముఖ్య అతిథులు, ప్రిన్సిపాల్ వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు నియామక పత్రాలు అందజేశారు. వివిధ బ్రాంచీల్లో మొదటి, రెండు, మూడవ సంవత్సరం విద్యార్థుల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు పొందిన వారికి మెమెంటోలు అందించి అభినందించారు. కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్ (గైస్) ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి.రమణ, వివిధ శాఖాధిపతులు పాల్గొన్నారు. డాక్టర్ కె.యమున కార్యక్రమానికి సంధానకర్తగా వ్యవహరించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

విశిష్టమైనది స్పర్శ సిద్ధాంతం



మాట్లాడుతున్న తెలుగు ఆచార్యుడు వెంకటేశ్వర యోగి

సీతంపేట: ఆధ్యాత్మిక వేత్తల స్పర్శ శిష్యుల్లోని అజ్ఞానాన్ని పోగొట్టి జ్ఞాన దీప్తిని కలిగిస్తుందని ఏయూ తెలుగు ఆచార్యుడు డాక్టర్ ఆతుకూరి వెంకటేశ్వర యోగి అన్నారు. సహృదయ సాహితి ఆధ్వర్యంలో స్థానిక ప్రిజమ్ కళాశాలలో బుధవారం జరిగిన సాహిత్య కార్యక్రమంలో ఆయన ప్రధాన ప్రసంగం చేశారు. వైద్యుల స్పర్శ రోగికి ఉపశమనం కలిగిస్తుందని, తెలుగు, సంస్కృత కావ్యాల్లో స్పర్శ విశేషమని పేర్కొన్నారు. భారతీయ పవిత్ర దాంపత్యం ధర్మానికి గొప్ప విశ్లేషణగా నిలిచిందన్నారు. దంపతుల మధ్య ఉండే పవిత్రమైన స్పర్శ గుణాన్ని రామాయణం దగ్గర నుంచి అనేక కావ్యాలు గొప్పగా వర్ణించాయని చెప్పారు. తెలుగు సాహిత్యంలో విశ్వనాథ సత్యనారాయణ స్పర్శ సిద్ధాంతాన్ని 'తెరచి రాజు' అనే నవలలో ప్రవేశపెట్టారని గుర్తుచేశారు. ఈ నవలలో కథానాయకుడు తనలోని శక్తిని స్పర్శ ద్వారా శిష్యుడిలోకి ప్రవేశపెడతాడన్నారు. స్పర్శ సిద్ధాంతం భారతీయ సాహిత్యంలో విశిష్ట స్థానం సంపాదించుకుందని తెలిపారు. సాహితీవేత్తలు శేఖరమంత్రి ప్రభాకర్, కె.జి.వేణు, డి.వి.సూర్యారావు పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

గోపాలపట్నం: మద్యం సేవించి వాహనం నడిపిన కేసుల్లో ఐదుగురికి 2వ తరగతి స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కె. మురళీకృష్ణ రూ.50వేలు జరిమానా విధించారు. గోపాలపట్నం ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మార్చి నెలలో నమోదైన కేసుల్లో జరిమానాతో పాటు నాలుగు రోజులు జైలు శిక్ష విధించారు.

కొలువులకు 78 మంది ఎంపిక



నియామక పత్రం అందజేస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, సంస్థ ప్రతినిధులు

పెదగంట్యాడ: యువతకు ఉపాధి కల్పించేందుకు నాలుగు ఎంఎన్‌సీ కంపెనీలు ముందుకు రావడం అభినందనీయమని జిల్లా ఉపాధి కార్యాలయ అధికారి సీహెచ్ సుబ్బిరెడ్డి, ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ కేఎస్ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక వికాస్‌నగర్‌లోని ప్రభుత్వ ఐటీఐలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో బుధవారం మెగా జాబ్ మేళా నిర్వహించారు. జాబ్‌మేళాకు సుమారు 141 మంది నిరుద్యోగులు హాజరయ్యారు. గ్రీన్‌టెక్ ఇండస్ట్రీస్, వరుణ్ మోటార్స్, డెక్కన్ ఫైన్ కెమికల్స్, వీల్స్ ఇండియా లిమిటెడ్ తదితర సంస్థలకు చెందిన ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఆయా కంపెనీలకు అవసరమైన 78 మందిని ఎంపిక చేశారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి రూ.10వేల744 నుంచి రూ.27వేల వరకూ జీతం ఇవ్వనున్నారు. అనంతరం వారికి నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ అధికారులు పి. శ్రీనివాసరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ల్యాబ్ టెక్నీషియన్లకు రీఓరియెంటేషన్ ట్రైనింగ్



శిక్షణ ఇస్తున్న జోనల్ మలేరియా అధికారి శాంతిప్రభ, సత్యనారాయణ, పాపారావు



శిక్షణకు హాజరైన ల్యాబ్ టెక్నీషియన్లు

సీతంపేట: జిల్లా మలేరియా అధికారి ఎం.తులసి ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లకు రేసపువానిపాలెంలోని రీజనల్ ట్రెనింగ్ సెంటర్(ఫిమేల్)లో రెండు రోజుల రీఓరియెంటేషన్ ట్రైనింగ్ బుధవారం ప్రారంభమైంది. జోనల్ మలేరియా అధికారి ఎం.శాంతిప్రభ, రీజనల్ ట్రెనింగ్ సెంటర్ ప్రిన్సిపాల్ బి.సుజాత, ఏఎంవో చిత్రాడ సత్యనారాయణ, విశ్రాంత ఎంపీహెచ్ఈవో కె.పాపారావు శిక్షణ ఇచ్చారు. మలేరియా స్లైడ్ మైక్రోస్కోప్‌లో ఎలా పరీక్షించాలి, పారసైట్ స్టేజెస్ గుర్తింపు, స్లైడ్ టెక్నిక్, బ్లడ్ కాంపోనెంట్స్, మలేరియా జీవిత చక్రం, దోమ జీవిత చక్రం, మైక్రోస్కోప్ కాంపోనెంట్స్, మలేరియా చార్టుల నిర్వహణ, స్టెయిన్ ప్రిపరేషన్, మలేరియా పారసైట్ ప్లాస్మోడియం వైవాక్స్, ప్లాస్మోడియం ఫాల్సీఫేరం ఎలా గుర్తించాలి తదితర అంశాలపై పవర్ పాయింట్, ప్రాక్టికల్‌గా మైక్రోస్కోప్‌లో చూపించి అవగాహన కల్పించారు. శిక్షణకు జిల్లాలోని వివిధ యూపీహెచ్‌సీల్లో పనిచేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లు హాజరయ్యారు.

ఎస్సీ వర్గీకరణ కమిషన్ ఉపసంహరణకు డిమాండ్



మాట్లాడుతున్న నాగ మల్లేశ్వరి

సీతంపేట: ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వం వేసిన కమిషన్‌ను ఉపసంహరించుకోవాలని మాల మహానాడు జాతీయ మహిళా అధ్యక్షురాలు డాక్టర్ మంచాల నాగమల్లేశ్వరి డిమాండ్ చేశారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ అంశాన్ని టచ్ చేసి అన్నదమ్ముల వలే ఉన్న తమను విడదీసే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. గతంలోనే ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ బద్ధంగా జరగలేదని, దీనిపై కోర్టులో పిటిషన్స్ వేశామన్నారు. అయినప్పటికీ కూటమి మందకృష్ణ మాదిగ మెప్పు కోసం, హడావుడిగా కమిషన్‌ను వేసి, ఎలాంటి ప్రాతిపదిక లేని వర్గీకరణ చేయడం సరికాదన్నారు. రాజకీయ లబ్ధికోసం, రాజకీయ అవకాశాల కోసం జాతిని తాకట్టు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సమగ్ర కుల గణన సర్వే జరగాలన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు అమలు చెయ్యలేక, డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆక్షేపించారు. ఎట్టి పరిస్థితుల్లో ఎస్సీ వర్గీకరణ జరగనివ్వబోమన్నారు. మాల మహానాడు నాయకులు త్రినాథ్, వెంకటరమణ, ధర్మవతి పాల్గొన్నారు.